సాక్షి
మహబూబాబాద్
గురువారం । 16 । నవంబర్ । 2023

వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పు

- వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కనిపించని అభివృద్ధి
- వర్షం పడితే వరదల వలయంలో వరంగల్ సిటీ



కలి'విడి'గా..

- ఒక ఊరు రెండు నియోజకవర్గాలు
- ఇద్దరు ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం

- వివరాలు 10లో▸

గరిష్టం/కనిష్టం
33.9° /18.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి కాస్త చలి తీవ్రత ఉంటుంది.

పోటీ వీరి మధ్యే!

ముగిసిన నామినేషన్ల విత్‌డ్రా

- సంక్షేమ పథకాలే ఆయుధంగా బీఆర్‌ఎస్
- ప్రభుత్వ వ్యతిరేకతే కాంగ్రెస్ ప్రచార అస్త్రం
- మోదీ చరిష్మాపై బీజేపీ ఆశలు
- ప్రచారంలో జోరు పెంచనున్న ప్రధాన పార్టీలు

మహబూబాబాద్...


శంకర్‌నాయక్ (బీఆర్‌ఎస్)


మురళీ నాయక్ (కాంగ్రెస్)


హుస్సేన్‌నాయక్ (బీజేపీ)

డోర్నకల్...


రెడ్యానాయక్ (బీఆర్‌ఎస్)


రాంచంద్రు నాయక్ (కాంగ్రెస్)


సంగీత (బీజేపీ)

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్/మరిపెడ: నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. అభ్యర్థులు ఎవరో తేలింది. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉండనుంది. ఆయా పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం చేపడుతుండగా.. మరింత ముమ్మరం చేయనున్నారు.

మహబూబాబాద్‌లో...

పథకాలే ఆయుధంగా శంకర్‌నాయక్..

తెలంగాణ ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్‌లో ఉంటూ రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన అధికార పార్టీ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ సంక్షేమ పథకాలే ఆయుధంగా ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల ఫైనల్ జాబితా వెల్లడికావడంతో ప్రచారంలో జోరు పెంచనున్నారు. మానుకోట పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పాటు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు మొదలైన అంశాలను ప్రస్తావిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ ఓట్లు అడుగుతున్నారు. అలాగే నియోజకవర్గంలోని గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం మండలాల అభివృద్ధిని ముందు పెడుతూ ఓట్లు అడుగుతున్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతను ప్రస్తావిస్తూ మురళీనాయక్..

మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన భూక్య మురళీనాయక్ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతను తనకు సానుకూలంగా మల్చుకుంటూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మహబూబబాద్‌కు సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేసిన జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి కుమారుడు భరత్ చందర్‌రెడ్డి మురళీనాయక్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తూ అన్నీ తానై నడిపిస్తున్నారు. వర్గవిభేదాలకు నిలయంగా ఉన్న మానుకోట కాంగ్రెస్‌లోని అన్ని వర్గాలను కలుపుకుంటూ ప్రచారం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై విమర్శలు చేయడం, కాంగ్రెస్ మేనిఫెస్టోలోనే ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేస్తూ ఓట్లు అడుగుతున్నారు.

మోదీ చరిష్మాతో హుస్సేన్‌నాయక్..

బీజేపీ మహబూబాబాద్ అభ్యర్థి జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రధాని మోదీ చరిష్మానే శ్రీరామరక్షగా భావించి ఓట్లు అడుగుతున్నారు. టికెట్ తనకే వస్తుందనే నమ్మకంతో రెండు నెలల నుంచే ప్రచారం చేపడుతున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి ఇప్పటి వరకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు దీటుగా ప్రచారం చేస్తూ.. నియోజకవర్గంలో తన సత్తా ఏంటో నిరూపించుకునే విధంగా శ్రమిస్తున్నారు. ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు.

డోర్నకల్‌లో...

సంక్షేమానికి అనుభవం జోడించి.. రెడ్యా

డోర్నకల్ నియోజకవర్గంలో ఆరుసార్లు విజయం సాధించిన డీఎస్ రెడ్యానాయక్ ఈసారి కూడా అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజలనాడి తెలిసిన నాయకుడిగా తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ సాధించిన విజయం, చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిన తీరును వివరిస్తూ ప్రచారంలో ముందుకు వెళ్తున్నారు. మహబూబాబాద్ ఎంపీ కవిత, మంత్రి సత్యవతి రాథోడ్ కూడా రెడ్యానాయక్ ప్రచారంలో పాల్గొంటూ బీఆర్‌ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు చెబుతున్నారు.

సానుభూతి పనిచేస్తుందని.. రాంచంద్రునాయక్..

చివరి నిమిషం వరకు పోటీపడి కాంగ్రెస్ డోర్నకల్ టికెట్ దక్కించుకున్న రాంచంద్రునాయక్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి ఓట్లు పొందడమే ప్రధాన లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పాతకాలం కాంగ్రెస్ నాయకులను కలుపుకుంటూ పోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత, పథకాలు అమలు చేయడంలో విఫలమైన తీరును ప్రస్తావిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

స్థానిక పరిచయాలతో సంగీత..

బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన నర్సింహులపేట జెడ్పీటీసీ భూక్య సంగీత బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్న డోర్నకల్‌లో బీజేపీ ప్రభావం తక్కువగానే ఉంటుంది. అయితే ఉమ్మడి నర్సింహులపేట మండలంలోని పరిచయాలు, బంధుమిత్రుల మద్దతు ఉపయోగపడుతుందని ఆమె భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని మోదీ చరిష్మా పనిచేస్తుందని నమ్ముతున్నారు.

ఉపసంహరణ.. ఫైనల్ జాబితా

జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. మానుకోట నియోజకవర్గంలో 15మంది అభ్యర్థులకు ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకోగా.. 12మంది బరిలో నిలిచినట్లు ఆర్వో, ఆర్డీఓ అలివేలు తెలిపారు. అలాగే డోర్నకల్ నియోజకవర్గంలో 17మంది అభ్యర్థులకు గానూ ముగ్గురు నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నట్లు ఆర్వో నర్సింహారావు తెలిపారు.

మానుకోట బరిలో నిలిచింది వీరే..

గుగులోత్ శేఖర్(బీఎస్పీ), భూక్య మురళీనాయక్ (కాంగ్రెస్), బానోత్ శంకర్‌నాయక్ (బీఆర్‌ఎస్), జాటోత్ హుస్సేన్‌నాయక్(బీజేపీ), జాటోత్ చక్రవర్తి(ధర్మసమాజ్ పార్టీ), జాటోత్ బిచ్యా (ఎంసీపీఐ), పోనక రాందాస్(రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా), వట్టం ఉపేందర్(బహుజనముక్తి పార్టీ), బట్టు బిన్నమ్మ(స్వతంత్ర), నూనావత్ రమేష్(స్వతంత్ర), గుగులోత్ వెంకన్న (స్వతంత్ర), దారావత్ వెంకన్న (స్వతంత్ర) అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా భూక్య బాలునాయక్ (బీజేపీ రెబల్), భూక్య మంగీలాల్ (స్వతంత్ర), నూనావత్ రాధ(కాంగ్రెస్ రెబల్) నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

డోర్నకల్ బరిలో 14మంది..

జాటోత్ రాంచంద్రునాయక్ (కాంగ్రెస్), డీఎస్ రెడ్యానాయక్ (బీఆర్‌ఎస్), గుగులోతు పార్వతి (బీఎస్పీ), భూక్య సంగీత(బీజేపీ), తేజావత్ సోమన్న (యుగతులసి పార్టీ), బాదావత్ రాజేష్(రిపబ్లిక్ పార్టీ), బానోతు లింగన్న(బ్లూ ఇండియా పార్టీ), భూక్య మహేందర్ (భారత చైతన్య యువజన పార్టీ), వాంకుడోతు రవికుమార్ (తెలంగాణ జాగీర్ పార్టీ), గుగులోతు రవీందర్(బహుజన ముక్తిపార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా గుగులోతు నరేష్, భూక్య గోపీకృష్ణ, అజ్మీరా రత్న, ఇస్లావత్ రవీందర్ బరిలో నిలిచారు. కాగా ముగ్గురు అభ్యర్థులు మాలోతు నెహ్రూనాయక్, మాలోతు చారుముజందర్, భూక్య బాలాజీ విత్‌డ్రా చేసుకున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి



మహబూబాబాద్: ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని జనరల్ అబ్జర్వర్ సింఘాల్, ఎన్నికల వ్యయ పరిశీలకులు బాబురాయ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం మానుకోట నియోజకవర్గ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అభ్యర్థుల వ్యయ పరిమితులకు లోబడి జమాఖర్చులు ఉండాలన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించొద్దన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అలివేలు, ఏఆర్వో, మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి లోకేష్ ఎంపికైనట్లు హెచ్‌ఎం అల్లి.రవి కుమార్, పీఈటీ దార్ల సునీల్ బుధవారం తెలిపారు. ఇటీవల డోర్నకల్‌లో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభకనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 17నుంచి 18వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. విద్యార్థి లోకేష్‌ను ఉపాధ్యాయులు దామోదర్, రవికుమార్, వీరభద్రం, బిక్కు, రాజేశ్వరీ, సురేష్, లింగమూర్తి, వీరన్న, ప్రభాకర్, చలపతి, నజిమున్నీసా అభినందించారు.

టీకాలను పంపిణీ చేయాలి



నెహ్రూసెంటర్: వ్యాధినిరోధక టీకాల పంపిణీతో పాటు గర్భిణులకు వందశాతం టీడీ వ్యాక్సిన్లు అందించాలని డీఎంహెచ్ఓ అంబరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇందిరానగర్, సిగ్నల్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, గోపాలపురం సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాల పంపిణీని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. టీకాల పంపిణీతో పాటు అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్ ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ఫ్రైడే, డ్రైడే నిర్వహించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించి ఐరన్ ట్యాబ్లెట్లను ఇప్పించాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ క్రిష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, డీపీఎం రుక్ముద్దీన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గూడూరు: మండలంలోని భూపతిపేట వద్ద చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి డీఎస్పీ సత్యనారాయణ వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఎమ్మెల్సీ తాతా మధు కారును నిలిపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి వాహనాన్ని అయినా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల పరిధిలోని సుడిబాక గ్రామంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకుల బూటకపు హామీలను ఆదివాసీలు నమ్మవద్దన్నారు. ఆదివాసీలు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కొత్త జిల్లాల పేరుతో ఆదివాసీలను విడదీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగ గణేష్, పూనెం ప్రతాప్, కనితి వెంకటకృష్ణ, సందీప్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఎస్ ప్రసాద్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధి ఈదులపూసపల్లి ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ బోధనతో విద్యార్థులను సృజనాత్మక వైపు నడిపించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం రుచిగా వండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంఓ చంద్రశేఖర్ ఆజాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య, సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, శ్రీనివాసులు, పీటర్, ప్రవీణ్ కుమార్, ఉప్పలయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఓంప్రకాశ్, కామేశ్వర్ రావు, వీరేందర్, భాగ్యలక్ష్మి, స్వప్న, శ్రీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం

మహబూబాబాద్: అర్హులైన దివ్యాంగ ఓటర్లు 12డీ ఫాం ద్వారా ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించామని, అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచామని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ముద్రించిన కరపత్రాలను జనరల్ అబ్జర్వర్ ఇరా సింఘాల్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయకులుగా వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు.

కాంగ్రెస్ ప్రజారాజ్యం స్థాపిద్దాం


సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపుతాం
- కొమ్మూరిని ప్రజాసేవకుడిగా గెలిపించండి
- టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి

జనగామ: ఉద్యమాల పురిటిగడ్డ జనగామ ప్రజలు కాంగ్రెస్ ప్రజారాజ్య స్థాపనకు పాటుపడాలని టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రం ప్రెస్టన్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సభకు తరలివచ్చిన జనాన్ని చూసిన రేవంత్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ పాపాలభైరవుల్ని కాటెయ్యడానికి వచ్చిన కాలనాగులుగా అభివర్ణిస్తూ.. జనగామ అభ్యర్థిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామనే నమ్మకం చూపించారని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎమ్మెల్యే, మంత్రి, టీపీసీసీ చీఫ్‌గా గౌరవిస్తే పొన్నాల లక్ష్మయ్య వృద్ధాప్యంలో పార్టీ మారి పరువు తీసుకున్నాడని అన్నారు. బీఆర్‌ఎస్ తరఫున జనగామ బరిలో నిలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు గుప్పించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై.. ఆయన కబ్జాలపై సొంత కూతురు కుండబద్దలు కొట్టిందని, ఇటువంటి నాయకులను కేసీఆర్ తన పక్కన పెట్టుకుని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కొమ్మూరిని ప్రజాసేవకుడిగా గెలిపిస్తే స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కళాశాల, చేర్యాల రెవెన్యూ డివిజన్ సత్వరమే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతామని చెప్పారు.

స్థానికేతరులను పంపిన కేసీఆర్ : కొమ్మూరి

పదేళ్ల క్రితం జనగామకు స్థానికేతరుడు ముత్తిరెడ్డిని పంపించిన కేసీఆర్ మరో స్థానికేతరుడైన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పంపాడని కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే.. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పాటుపడుతానని, చేర్యాల రెవెన్యూ డివిజన్, జనగామ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కొమ్మూరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, టీపీసీసీ, మాజీ ప్రతినిధులు, నాయకులు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, పోరిక బలరాం నాయక్, డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్, సిరిసిల్ల రాజయ్య దితరులు పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్


పాలకుర్తి: దయాకర్‌రావుకు గొర్రె పిల్లను బహూకరిస్తున్న వృత్తిదారులు


రాయపర్తి: మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎల్లయ్య తదితరులు

- గొల్ల కురుమలకు మరిన్ని రుణాలు
- గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తాం
- ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తా..
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి/రాయపర్తి: ప్రజల దీవెనలతో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతున్నారని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తిలో గొల్ల, కురుమలు నిర్వహించిన ర్యాలీ అనంతరం బషారత్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బక్క నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో దయాకర్‌రావు మాట్లాడారు. గొల్ల కురుమలను గత పాలకులు పట్టించుకోలేదని, బీఆర్‌ఎస్ సర్కారు వారికి జీవనోపాధి కల్పించడానికి సబ్సిడీపై గొర్రెల యూనిట్లు పంపిణీ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి పెంపునకు రూపొందించిన ఈ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వృత్తిదారులకు మరిన్ని రుణాలు ఇప్పించడానికి సీఎం పట్టుదలతో ఉన్నారని, బీఆర్‌ఎస్‌ను ఆదరించి అధికారంలోకి తేవాలని కోరారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను.. ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని దయాకర్‌రావు అన్నారు. సభలో ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి, స్వచ్ఛంద సంస్థల నాయకుడు డాక్టర్ భిక్షపతి, పండుగ నారాయణ, సలేంద్ర సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


సిరిసన్నగూడెంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

తండాలను పంచాయతీలు చేశాం..

పాలకుర్తి మండలంలోని సిరిసన్నగూడెం, కంభాలకుంట తండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దుర్భరంగా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అన్ని వసతులు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్ సర్కారుదే అని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించగా.. ఎంతో మంది పేదలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామని అన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాయపర్తి మండలం మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కంజర్ల ఎల్లయ్య, కొలన్‌పల్లికి చెందిన 30 మంది యువకులు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడంతోపాటు పాలకుర్తి గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, కాంచనపల్లి వనజారాణి, గజవెల్లి అనంత, భూక్య క్రాంతి, చెన్నబోయిన రవి, సురేష్, టీఎం రంగాచారి, ఆలకుంట స్వామి, వంగాల నర్సయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గౌడల మద్దతు..

ఎన్నికల్లో మంత్రి దయాకర్‌రావుకు గౌడల మద్దతు ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన పాలకుర్తి, జనగామలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కారు గౌడల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఏటా రూ.20 కోట్ల రెంటల్ మాఫీ చేసిందన్నారు. 103 సొసైటీలను నూతనంగా తెరి పించడంతోపాటు వైన్ షాపుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. పార్టీని తిరిగి అధికా రంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు, గట్టు రమేష్, ఏకాంతం, విద్యాసాగర్, మూల వెంకటేశ్వర్లు, పోశాలు వెంకన్న, కమ్మగాని పరమేశ్వర్, గిరగాని సమ్మయ్య, కమ్మగాని నాగన్న పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె శశాంక అన్నారు. ఈసీ ఆదేశాల ప్రకారం స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కు బ్రహ్మాస్త్రం లాటిందన్నారు. స్వీప్ కార్యక్రమాల వల్ల ఓటు నమోదు శాతం పెరిగిందని, ఓటింగ్ శాతం పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు తుది జాబితా పూర్తి అయిందని, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయో వృద్ధులను దృష్టిలో పెట్టుకుని తగు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ర్యాలీలో అదనపు కలెక్టర్ డేవిడ్, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రతి నియోజకవర్గంలో 5మోడల్,5మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులుతో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ కేంద్రంలో తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈఓ రమాదేవి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ..

జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల్లో నేటిన నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామని కలెక్టర్ శశాంక అన్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల సహకారంతో బీఎల్ఓల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి: సీపీ

వరంగల్ క్రైం: ఎన్నికల వేళ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. పెట్రోకార్ సిబ్బంది తమకు అప్పగించిన పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో సిబ్బంది డేగ కన్నుతో తమ పరిసరాల్ని పరిశీలించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, రమేశ్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, సురేందర్, ఆర్.ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నర్సంపేట రూరల్: చికిత్స పొందుతూ బాలిక మృతిచెందింది. జిల్లాలోని గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన బోడ తార్య–సైంత్ర దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె అఖిల (10) ఉన్నారు. అఖిల నెక్కొండ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. నాలుగు రోజుల క్రితం అఖిలకు జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేసినా నయం కాకపోవడంతో నర్సంపేట పట్టణంలోని క్రెడిల్ పిల్లల ఆస్పత్రికి ఈనెల 13న అర్ధరాత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్ మృతిచెందినట్లు తెలిపారు. అఖిల మృతదేహాన్ని బుధవారం రాత్రి నర్సంపేటలోని క్రెడిల్ ఆస్పత్రికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. సీఐ రవి కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

మా తప్పిదం ఏమి లేదు..

కుటుంబ సభ్యులు బాలికను ఈనెల 13న అర్ధరాత్రి మా ఆస్పత్రికి తీసుకురాగానే పరిశీలించాం. ఆర్ఎంపీ వేసిన టీకాతోనే తొంటి భాగానికి పూర్తిగా ఇన్ఫెక్షన్ అయ్యింది. చూసి రెఫర్ చేస్తామని చెప్పగా మీరే చికిత్స చేయాలని కుటుంబ సభ్యులు కోరడంతో చికిత్స అందించాం. అఖిలకు ఇన్ఫెక్షన్ ఎక్కువ కావడంతో వరంగల్‌కు రెఫర్ చేశాం. మా తప్పిదం ఏమి లేదు. –డాక్టర్ అరుణ్, క్రైడిల్ పిల్లల ఆస్పత్రి

జంగ్ తెలంగాణ

● పూరి చేస్తా.. కారు గుర్తుకు ఓటేయండి



నర్సంపేట: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోరుతూ ప్రచారంలో భాగంగా పూరిలు చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న పెద్ది స్వప్న

● రూ.400కే గ్యాస్ సిలిండర్..



కేసముద్రం : కోరుకొండపల్లిలో గ్యాస్ సిలిండర్‌తో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్

● ఉండమ్మ బొట్టు పెడతా..



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలం దీక్షకుంట గ్రామంలో మహిళకు బొట్టు పెట్టి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కీర్తిరెడ్డి

ప్లీజ్ కాస్ట్ యువర్ ఓట్..

ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఓ చిన్నారి ఈవీఎం వేషధారణలో వినూత్న ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారం పలువురిని ఆకట్టుకుంది.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలి

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఓటు అనే ఆయుధంతో గద్దె దించాలని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో బుధవారం నిర్వహించిన 'పదేళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కర్తవ్యాల సదస్సు'కు ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణను తాను ఒక్కడినే తెచ్చానని, చావునోట్ల తల పెట్టి తెలంగాణను సాధించానని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేశారని, ప్రవళిక ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, రాజకీయంగా బతకాలని ప్రవళిక ప్రవర్తనను సీఎం కేసీఆర్ మార్చేశారన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు విముక్తి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

రావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఉమా మురళీ నాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నాయకులు అంబటి శ్రీనివాస్, బైరి రమేష్, గోపగాని శంకర్‌రావు, ఖాజాపాషా, శ్రీనివాసులు, గోవర్ధన్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కలి'విడి'గా..

● తండాను వేరు చేస్తున్న రహదారి
● ఎదురెదురుగా తండ్రి, కుమారుడి ఇళ్లు
● ఓ వైపు డోర్నకల్, మరోవైపు ఇల్లెందు నియోజకవర్గాలు
● ఫలితం ఒకే తండా..ఇద్దరు ఎమ్మెల్యేలు



ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్న లచ్చాతండా

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 71 ఇళ్లు, 213 మంది ఓటర్లు కలిగిన ఓ చిన్న తండాకు ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఐదవ వార్డు పరిధి లచ్చాతండా మధ్యలో సీసీ రోడ్డు ఉంటుంది. తండాలోకి వెళ్తుండగా కుడివైపున డోర్నకల్ మున్సిపాలిటీ ఐదవ వార్డు పరిధిలో 40 ఇళ్లు ఉండగా, 140 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోకి వస్తారు. రోడ్డుకు ఎడమ వైపున లచ్చాతండా ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం, బర్లగూడెం పరిధిలోని 10వ వార్డులో ఉండగా ఇక్కడ 31 ఇళ్లు, 73 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడి ఓటర్లంతా ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో ఉన్నారు. తండాలో ఒకే కుటుంబానికి చెందిన వారు విడిపోయి రోడ్డుకు ఇరు పక్కల ఇళ్లు నిర్మించుకోవడంతో తండ్రి కుటుంబం ఓ నియోజకవర్గంలో, కుమారుడి కుటుంబం మరో నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు ఈ తండాకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి డీఎస్ రెడ్యానాయక్, ఇల్లెందు నుంచి హరిప్రియ ప్రాతినిథ్యం వహించారు.

ఎర్రమట్టితండా..

డోర్నకల్ మున్సిపాలిటీ మూడో వార్డు పరిధిలోని ఎర్రమట్టి తండా, గార్ల మండలం రాజుతండా గ్రామపంచాయతీలు కలిసి ఉన్నాయి. రోడ్డుకు ఓ వైపు ఎర్రమట్టితండా, మరో వైపు రాజుతండా ఉండగా రెండు తండాలను విడదీస్తూ మధ్యలో రోడ్డు ఉంది. అయితే తండాలు కలిసి ఉన్నా డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో ఉండడం గమనార్హం.

చికిత్స పొందుతూ ప్రేమికుల మృతి

ఏటూరునాగారం/మంగపేట: తమ ప్రేమను పెద్దలు అంగీకరించి పెళ్లి చేస్తారో లేరోనని మనస్తాపానికి గురైన ప్రేమికులు పురుగుల మందు తాగిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది.. ఏటూరునాగారం మండలానికి చెందిన బెజ్జంకి వేణుగోపాల్, అరుణ దంపతుల కుమారుడు రాజేష్(25), మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన మాదరి శిరీష(22) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో పెద్దలు తమ వివాహం చేస్తారో లేదో అని అపోహపడి మంగళవారం



శిరీష(ఫైల్)



రాజేష్ (ఫైల్)

రాత్రి మల్లూరు గుట్ట వద్ద పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఇరు కుటుంబ సభ్యులు.. వారిద్దరిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మంగపేట ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పుగా కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో వానాకాలంలో వర్షం వచ్చిందంటే చాలు.. నగరవాసులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా వరదతతో నరకయాతన అనుభవించారు. వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని చెబుతున్నా ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. చివరకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన వరంగల్ మోడ్రన్ బస్టాండ్, సమీకృత కలెక్టరేట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉర్సు గుట్ట బండ్ పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన రహదారులు నిర్మించినా.. డ్రెయినేజీలు అసంపూర్తిగా వదిలేశారు.

- సాక్షి, వరంగల్, వరంగల్ అర్బన్



వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పు

గ్రౌండ్ రిపోర్ట్ వరంగల్ తూర్పు

అభివృద్ధికి నోచుకోని పాత బీట్ బజార్

వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కనిపించని అభివృద్ధి

● వర్షం పడితే వరదల వలయం.. వరంగల్ సిటీ
● మొదలుకాని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు
● సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు అంతంతే..
● మూడేళ్లైనా మొదలుకాని ఉర్సుగుట్ట బండ్ పనులు
● వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులే కాస్త బెటర్..



నిరుపయోగంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్





దూపకుంటలో నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు అందజేయని 'డబుల్'ఇళ్లు పిల్లర్ల దశలోనే కనిపిస్తున్న వరంగల్ కలెక్టరేట్ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఏయే పనులు... ఎక్కడ అంటే..

- నియోజకవర్గంలో వరద ముంపు బెడద ఎక్కువగా ఉంది. వానొస్తే చాలు కొన్ని కాలనీలు నీట మునుగుతున్నాయి. వర్షాకాలంలో లోతట్టు కాలనీల ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బొంది వాగు నాలా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసినా పనులు మొదలు కాలేదు.
- వరంగల్ ప్రాంతంలో ముఖ్యమైన జంక్షన్ల అభివృద్ధి అంతంతా మాత్రమే. ఏ జంక్షన్‌లో కూడా పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. ఫలితంగా ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు సతమతమవుతున్నారు.
- వరంగల్‌లోని పాత బస్తీల్లో ఇరుకు రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. బల్దియా ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్ల అంతర్గత రోడ్ల అభివృద్ధి జరగడం లేదు.నిజాం కాలం నాటి డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్వల్ప వర్షానికి కూడా నీరు సాఫీగా ముందుకు సాగక రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి.
- వరంగల్ లక్ష్మీపురంలోని 4.16 ఎకరాల విస్తీర్ణంలో రూ. 24 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. పనులు మొదలై నెలలు గడిచాయి. అయినా పనులు స్లాబ్ వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులు పూర్తయ్యే సరికి మరో ఏడాది కాలం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునికీకరణ కోసం రూ.73 కోట్లు వెచ్చించారు. పనులు ప్రారంభించి ఆరు నెలలు గడిచినా పాత బస్ స్టేషన్ కూల్చివేత ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.
- వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పనుల ఊసేలేదు.
- వరంగల్ ఎంజీఎం నుంచి కాశిబుగ్గ, లేబర్ కాలనీ, వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్, హెడ్ పోస్టాఫీస్, ఆర్ఎన్‌టీ రోడ్డు, మేదరవాడ, జేపీఎన్ రోడ్డు, మండి బజార్ నుంచి పోచమ్మమైదాన్ వరకు 11 స్మార్ట్‌సిటీ రోడ్ల నిర్మాణానికి రూ.66.55 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయి. కాగా, సీసీ రోడ్డు, భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. అయితే డ్రెయినేజీ పైపులైన్ల చాంబర్లపై కప్పులు అక్కడక్కడ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఫుట్ పాత్‌లు నిర్మాణాలు అక్కడక్కడ ప్రారంభించి మధ్యలో వదిలేశారు. బట్టల బజార్ ఫ్లై ఓవర్ కరీమాబాద్ నుంచి ఉర్సు మీదుగా గవిచర్ల క్రాస్ వరకు స్మార్ట్‌సిటీ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీకి రూ.16.55 కోట్లతో చేపట్టిన పనులు అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. కరీమాబాద్ రోడ్డు నుంచి ఉర్సు గుట్ట వరకు దసరా స్మార్ట్‌సిటీ రోడ్డు రూ.5.78 కోట్లతో చేపట్టిన పనులు సగం వరకే పూర్తయ్యాయి.
- వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ.1.250 కోట్లతో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు మాత్రం జోరుగా కొనసాగుతున్నాయి.
- ఈ నియోజకవర్గంలో లీకేజీల సమస్యతో ప్రజలకు అరకొర తాగునీరు సరఫరా అవుతోంది.
- వరంగల్ కలెక్టరేట్‌ను రూ.22 కోట్లతో నిర్మిస్తున్నారు. పిల్లర్ల దశలో పనులు కొనసాగుతున్నాయి.
- పారిశుద్ధ్య సమస్య ప్రజలను వెంటాడుతోంది.
- ఉర్సు రంగసముద్రం బండ్ అభివృద్ధి పనులు రూ.16 కోట్లతో టెండర్లు పిలిచినా ఇంత వరకు పనులు మొదలు కాలేదు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దశాబ్దాలుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామనే హామీ నెరవేర్చాలి. స్మార్ట్‌సిటీ నిధులతో నియోజకవర్గాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలి. పాదాచారులకు ఫుట్ పాత్‌లు నిర్మించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

- సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి అధ్యక్షుడు

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి




నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పక్కాదారి పడుతున్నారు. పరిశ్రమలు స్థాపించి, ఉపాధి కల్పించి వారిలో కొనుగోలు శక్తి మెరుగయ్యేలా కృషి చేయాలి. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు మెరుగుపర్చాలి. అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేయాలి.

- సూరినేని రామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

అస్త్రశస్త్రాలు..

డబ్బు, మద్యం, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులు

● ఎన్నికలను శాసిస్తున్న పంచభూతాలు ఇవే..
● వీటినే నమ్ముకున్న నాయకులు
● అన్ని పార్టీల్లోనూ అదే తీరు



కాజీపేట : గాలి, నీరు, ఆకాశం, భూమి, అగ్ని.. ఇవీ పంచ భూతాలు. సమస్త జంతు, వృక్ష, జీవ మనుగడకు ఇవే ఆధారం. వీటితోనే ప్రకృతి తన ధర్మం నిర్వర్తిస్తుంది. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా మనుగడ అసాధ్యం. అదే కోవలో వివిధ ఎన్నికల్లో విజయం సాధించడానికి పోటీల్లో ఉన్న అభ్యర్థులు మరో పంచభూతాలను నమ్ముకుంటున్నారు. అవే డబ్బు, మద్యం, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులు. ప్రతి ఎన్నికల్లో ఇవీ పంచభూతాలై రాజకీయాలను శాసిస్తున్నాయి. నాయకులు.. ఓటర్లను అనేక రకాలు ప్రలోభపెట్టి మసిపూసి మారెడుకాయ చేస్తున్నారు. ఫలితంగా ఈ పంచ భూతాలు కలిగిన వాడే రాజకీయ నాయకుడు అనే నానుడి నడుస్తోంది.

నోటు.. ఓటు

డబ్బుకు ఓటరు దాసోహం అన్నట్లు నోటు ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. మనిషికి పంచభూతాల్లో భూమి ఎంత అవసరమో రాజకీయాల్లో డబ్బుకు అంత ప్రాధాన్యం ఉంది. దీంతో రూ. కోట్లను ఖర్చు చేస్తూ ఎన్నికల్లో గెలువడానికి నాయకులు యత్నిస్తున్నారు.

మద్యం.. మంచినీళ్లతో సమానం

పంచభూతాల్లో నీరు ఎంత ముఖ్యమో..రాజకీయ పంచభూతాల్లో మద్యానికి అంతకుమించి ప్రాధాన్యం ఉంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంతో ఆరంభించి విజేతలుగా మారే వరకు మద్యాన్ని ఏరులై పారించడం పరిపాటిగా మారుతోంది. ఓటరుకు మద్యం ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితులే ఎక్కువగా ఉన్నాయి. మద్యం .. బీరు, బ్రాందీ, విస్కీ తదితర వివిధ రూపాల్లో ఓటర్లకు చేరుతోంది.

అంగబలం.. అవసరం

బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టు రాజకీయ నాయకులకు అంగబలం లేకపోతే అన్ని చచ్చుబడిపోయినట్టే. అందుకే తమ చుట్టూ ఎప్పుడూ 10 మంది ఉండేలా ప్రైవేట్ సైన్యాన్ని పెంచి పోషిస్తుంటారు. టికెట్ వస్తే ప్రచారానికి, రాకపోతే దిష్టిబొమ్మలు దహనం చేయడానికి వీరిని ఉపయోగిస్తారు. లేదంటే ఎదుటి వ్యక్తులను భయపెట్టడానికి అవసరం. ఈ భూతం లీడర్‌కు ప్రాణవాయువుతో సమానం.

నిప్పులాంటి భూతం వాగ్దానం..

రాజకీయాల్లో నిప్పులాంటి భూతామే వాగ్దానం. అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఓటరును ప్రలోభ పెట్టడంలో మన నాయకులు ఆరితేరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల దాకా బూడిదను చూపించి మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనిపించకుండా పోవడం ఈ వాగ్దాన భూత రాజకీయ లక్షణం. ఇళ్లు, స్థలాలు, ఇన్సూరెన్స్, ఉచిత పథకాల పేరుతో వాగ్దానాలు చేయడం ఈ భూతం ఓటర్లను ప్రలోభపెడుతోంది.

ఫిరాయింపులు..



రాజకీయాల్లో గాలిలాంటి ఐదో భూతమే ఫిరాయింపులు. ఈ భూతం గోడ మీది పిల్లిలా, తక్కెడలోని కప్పలాంటి లక్షణాలతో ఉంటుంది. టికెట్ రాక పోయినా, సరైన ప్రాతినిథ్యం దక్కడం లేదని భావించినా, ఇతర ప్రయోజనాలు కనిపించిన వెంటనే గోడ దూకుతారు. ఈ భూతం పేరు చెబితే నాయకులకు ముచ్చెమటలు పట్టాల్సిందే. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఈ ఫిరాయింపుదారులదే హవా నడుస్తుంది.

సై అంటే..సై


● శాసనసభ ఎన్నికల్లో నానాటికీ పెరుగుతున్న అభ్యర్థుల సంఖ్య
● రాజకీయాల్లో అధికమవుతున్న పోటీతత్వం..

హన్మకొండ అర్బన్: ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో కొందరు.. వారసత్వంగా మరికొందరు.. సమాజ మార్పే ధ్యేయంగా ఇంకొందరు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. వివిధ రూపాల్లో నిత్యం అలుపెరుగని పోరాటాలు చేస్తూ సందర్భానుసారం సాధారణ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. దీంతో రాజకీయాల్లో రోజురోజుకూ పోటీతత్వం పెరుగుతోంది. దీనికి నిదర్శనమే ఈ సంవత్సరాల్లో జరిగిన సాధారణ ఎన్నికలు. 2009.. 2014.. 2018 వరుసగా జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో వివిధ రాజకీయపార్టీల నుంచి పోటీ చేసేవారితోపాటు స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2009 నుంచి ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య, అందులోని ఆసక్తికర అంశాలు ఒకసారి పరిశీలిస్తే..

- 2009లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
- 2014లో 154 మంది బరిలో నిలిచారు.

నియోజకవర్గం	2009	2014	2018	2023
జనగామ	12	19	15	19
స్టేషన్‌ఘన్‌పూర్	11	10	08	19
పాలకుర్తి	12	14	18	15
డోర్నకల్	09	08	11	14
మహబూబాబాద్	10	13	11	12
నర్సంపేట	11	12	11	16
పరకాల	10	14	15	28
వరంగల్(ప)	15	16	21	15
వరంగల్(తూ)	15	13	21	29
వర్ధన్నపేట	14	12	15	14
భూపాలపల్లి	18	12	14	23
ములుగు	09	11	12	11
మొత్తం	136	154	172	215

- 2009లో అత్యధికంగా భూపాలపల్లి నియోజకవర్గానికి 18మంది అభ్యర్థులు పోటీచేయగా అతి తక్కువ మంది డోర్నకల్, ములుగు స్థానాలకు 9 మంది చొప్పున పోటీచేశారు.
- 2014లో జనగామకు అత్యధికంగా 19 మంది అభ్యర్థులు, డోర్నకల్‌కు అతి తక్కువగా 8మంది పోటీ చేశారు.
- 2018లో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమలో మాత్రమే 21 మంది చొప్పున అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గత మూడు సాధారణ ఎన్నికల్లో ఇవే నియోజకవర్గాల నుంచి అత్యధిక అభ్యర్థులు పోటీ చేశారు. కాగా, అత్యధిక మంది అభ్యర్థులు పోటీ చేసిన నియోజకవర్గాలుగా తూర్పు, పశ్చిమలు రికార్డ్ నెలకొల్పాయి.



2023 సాధారణ ఎన్నికలకు సంబంధించి స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల్లో కొన్ని...